E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 27-09-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

# ఫార్మాపైనా ట్రంప్ కొరడా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి సుంకాల కత్తి ఝుళిపించారు. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై 100శాతం, కిచెన్ క్యాబినెట్లు, బాత్‌రూమ్ వ్యానిటీ...

» బ్రాండెడ్, పేటెంట్ ఔషధాలపై 100% టారిఫ్

» అక్టోబరు 1 నుంచి అమలు: డొనాల్డ్ ట్రంప్

» తగ్గిన పలు ప్రముఖ ఫార్మా కంపెనీల షేర్ల విలువ

» ఈ సుంకాల పెంపు జనరిక్ ఔషధాలపైన కాదు

» భారతీయ కంపెనీలపై ప్రభావం తక్కువే

» ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ ప్రకటన

ఈకబురు, వాషింగ్టన్,: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి సుం కాల కత్తి ఝుళిపించారు. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై 100శాతం, కిచెన్ క్యాబినెట్లు, బాత్‌రూమ్ వ్యానిటీ (సింక్, దాని కింద ఉండే స్టోరేజీ క్యాబినెట్) లపై 50%, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై (కుషన్ ఉన్న సోఫాలు/కుర్చీల వంటివి) 30%, హెవీ ట్రక్కులపై 25% దిగుమతి సుంకాలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సుంకాల గురించి ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' పోస్టు ద్వారా వెల్లడించారు. "అక్టోబరు 1 నుంచి.. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మా ఉత్పత్తులపై 100శాతం సుంకం విధిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులన్నీ విదేశాల నుంచి అమెరికాను వరదలా ముంచెత్తుతున్నాయని.. ఇది చాలా అన్యాయమని.. అమెరికా జాతీయ భద్రతను కాపాడుకోవడం కోసం, ఇతర కారణాలరీత్యా, అమెరికా తయారీ రంగాన్ని రక్షించుకోవడానికే వాటిపై సుంకాలు విధిస్తున్నానని పేర్కొన్నారు. అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు (నిర్మాణం మొదలుపెట్టినవి/ఇప్పటికే జరుగుతున్నవి) ఈ సుంకాలు వర్తించవని ట్రంప్ తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఫ్యాక్టరీలు నిర్మించిన కంపెనీలకు ఈ సుంకాలు వర్తిస్తాయా? లేదా అనే అంశంపై స్పష్టత లేదు.

తరువాయి 2లో

# బీసీలకు 42%రిజర్వేషన్లు



» స్థానిక సంస్థల్లో అమలుకు ఉత్తర్వులు

ఈకబురు, రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణలోని అసాధారణమైన పరిస్థితులు, సామాజిక, రాజకీయ సూచికల్లో బీసీల వెనుకబాటు నేపథ్యంలో వారి సంక్షేమం, సాధికారత, ప్రాతినిధ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కచ్చితమైన సమాచారం, శాసనసభ ఆమోదం నేపథ్యంలో రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు 42 శాతం సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో నం.3) జారీ చేశారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా పురపాలక, పంచాయతీ రాజ్ శాఖలు చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

తరువాయి 2లో

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో.. ప్రజలపై రూ.15వేల కోట్ల అప్పుల భారం



» 3లో

# మోగనున్న 'స్థానిక' నగారా!

» బీసీ రిజర్వేషన్లపై ఉత్తర్వుల నేపథ్యంలో మార్గం సుగమం

» అధికారులతో సమీక్షించిన సీఎం

» ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్!




File

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నాహాల కోసం ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం ఏర్పాటుచేసింది. ఇందులో ఎన్నికల షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్, ఆ తర్వాత నోటిఫికేషన్ జారీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది.

తరువాయి 2లో

మా ప్రపంచం వేరు రష్మిక..

» 5లో



అనిశ్చితిలోనూ పటిష్ఠంగా భారత్: నిర్మలా సీతారామన్

» 4లో



## చరిత్ర పుటల్లోకి మిగ్21



» 3లో

## డీజీపీగా శివధర్‌రెడ్డి



రెండుసార్లు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అనుభవం

అక్టోబరు 1న బాధ్యతల స్వీకరణ

ఈకబురు, హైదరాబాద్: తెలంగాణ డీజీపీగా బత్తుల శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానానికి పలువురు ఐపీఎస్ ఉన్నతాధికారుల పేర్లు వినిపించినా ప్రస్తుత ఇంటెలిజెన్స్ చీఫ్ వైపే ప్రభుత్వం మొగ్గుచూపింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్‌రెడ్డిని డీజీపీ(సమన్వయం)గా నియమిస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు హెడ్ ఆఫ్ ది పోలీస్ ఫోర్స్(హెచ్‌వోపీ

తరువాయి 2లో

## బిహార్ మహిళల ఖాతాల్లోకి పదేసి వేలు



» 75 లక్షల మందికి లబ్ధి

» సీఎం మహిళా రోజ్‌గార్ యోజనకు శ్రీకారం

» ఆర్జేడీ కూటమిని అడ్డుకోవాలని మోదీ పిలుపు

ఈకబురు, పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్డీయే కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర మహిళల అభ్యున్నతికి 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పేరుతో కొత్త పథకాన్ని శుక్రవారం ప్రధాని మోదీ దిల్లీ నుంచి ప్రారంభించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 75 లక్షలమంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, పలువురు మంత్రులు సహా పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

5లోగా ఫిరాయింపులపై విచారణ!



» 2లో

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



» 3లో

# హైదరాబాద్‌లో భారీ వర్షం..

అనూహ్యంగా ఉప్పొంగిన మూసీ

జంటజలాశయాల నుంచి 35 వేల క్యూసెక్కుల ప్రవాహం

అర్ధరాత్రి నీట మునిగిన ఎంజీబీఎస్.. చిక్కుకుపోయిన ప్రయాణికులు

సీఎం సమీక్ష... ప్రయాణికులను సురక్షితంగా తీసుకురావాలని ఆదేశం



ఈకబురు, హైదరాబాద్ , చంచల్‌గూడ, రాజేంద్రనగర్, బండ్లగూడజాగీర్, నార్సింగి: ఎగువన కురిసిన భారీ వర్షాలతో జంట జలాశయాల గేట్లు ఎత్తి భారీగా వరదను దిగువకు వదలడంతో హైదరాబాద్ నగరం మధ్యలో మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మహోగ్రరూపం దాల్చింది. చాదర్‌ఘాట్ లోలెవల్ వంతెన పైనుంచి ఆరు అడుగుల మేర, మూసారాంబాగ్ వంతెనపై నుంచి 10 అడుగుల మేర వరద ప్రవహించింది. ఎంజీబీఎస్‌లోకి వెళ్లే రెండు బ్రిడ్జిలు నీట మునిగాయి. మూసీ వరద బస్టాండ్‌లోకి చేరింది. వేల మంది ప్రయాణికులు బస్టాండ్‌లో చిక్కుకుపోయారు. ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు.

తరువాయి 2లో

హీరోగా కట్టప్ప.. ఒకవేళ నిజమైతే?

» 5లో



సూపర్ ఓవర్‌లో శ్రీలంకపై విజయం సాధించిన భారత్

» 6లో



## జూబ్లీహిల్స్ భారాసకు కంచుకోట

» జూబ్లీహిల్స్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీతా గోపీనాథ్ పేరు ఖరారు



తరువాయి3లో

# ఫార్మాపైనా ట్రంప్ కొరడా

మొదటి పేజీ తరువాయి



మన కంపెనీలపై..
ట్రంప్ సుంకాల ప్రకటనతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ శుక్రవారం 2.5శాతం పతనమైంది. సన్ ఫార్మా షేరు ధర 4.87శాతం తగ్గి 52వారాల కనిష్ఠానికి (రూ. 1,548), గ్లాండ్ ఫార్మా షేరు 4.7% తగ్గి రూ. 1,880 కి.. బయోకాన్ షేర్ 3.68% తగ్గి రూ.342.85కు చేరాయి. లారస్‌ల్యాబ్స్, ఇప్కా ల్యాబ్స్, దివీస్, జైడస్ లైఫ్, అల్‌కెమ్ ల్యాబ్స్, సిప్లా, అజంతా ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టొరెంట్ ఫార్మా, అబ్బాట్ ఇండియా, గ్లెన్‌మార్క్ తదితర కంపెనీల షేర్లు 0.8%3.2% పతనమయ్యాయి. ట్రంప్ విధించిన సుంకాలు బ్రాండెడ్, పేటెంటెడ్ ఔషధాలపైనే కాబట్టి జనరిక్ ఔషధాలకు మినహాయింపు ఉండటంతో ఈ సుంకాల ప్రభావం భారత కంపెనీలపై తక్షణమే పెద్దగా పడదని డాక్టర్‌రెడ్డీస్, సన్ ఫార్మా సహా దేశంలోని 23ప్రముఖ ఫార్మా కంపెనీల సమాహారమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. భారత ఫార్మా ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించే ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్స్‌ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) చైర్మన్ నమిత్ జోషీ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మన కంపెనీల ఎగుమతుల్లో ఎక్కువ సాధారణ జనరిక్ ఔషధాలే కాబట్టి.. పెద్దపెద్ద భారతీయ కంపెనీలన్నీ ఇప్పటికే అమెరికాలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి కాబట్టి సుంకాల తక్షణ ప్రభావం అంతగా ఉండదన్నారు. భారత్ వీలైనంత త్వరగా అమెరికాతో, ఈయూతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఫౌండేషన్ ఫర్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక సంచాలకుడు రాహుల్ అహ్లూవాలియా సూచిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. భారతదేశ ఫార్మా ఉత్పత్తులకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్.. అమెరికానే! ఫార్మెక్సిల్ లెక్కల ప్రకారం.. 202425ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వివిధ దేశాలకు ఎగుమతి కాగా.. అందు లో అత్యధికంగా 31శాతం ఉత్పత్తులు అమెరికాకే వెళ్లాయి. ఆ ఉత్పత్తుల విలువ 8.7బిలియన్‌డాలర్లు (దాదాపు రూ.77,138కోట్లు). ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో 3.7బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32,505 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతయ్యాయి. అమెరికాలో వాడే జనరిక్ మందుల్లో 45%, బయోసిమిలర్ డ్రగ్స్‌లో (జనరిక్ అంటే అసలు మందుకు పూర్తిస్థాయి నకళ్లు. బయోసిమిలర్ అంటే.. అసలు మందుతో దాదాపు సమానమైన మిశ్రమాలుండే ఔషధాలు)15% ఔషధాలు భారత్ నుంచే సరఫరా అవుతాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్‌లైఫ్‌సైన్సెస్, సన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి కంపెనీల మొత్తం ఆదాయంలో 3050శాతం ఆదాయాన్ని అమెరికా నుంచే ఆర్జిస్తాయి. అమెరికా నుంచి వచ్చే ఆదాయంలో అధికభాగం ఆయా కంపెనీలకు.. జనరిక్ ఔషధాలతోనే వస్తుంది. భారత్ నుంచి ఎగుమ తయ్యే 8.7 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల్లో బ్రాండెడ్ ఔషధాల విలువ 10%లోపు ఉంటుందని అంచనా. ఈమేరకు సుంకాల ప్రభావం భారత ఫార్మాపై ఉంటుందని పరిశ్రమ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బీసీలకు 42%రిజర్వేషన్లు



సామాజిక న్యాయం కోసం..
సామాజిక న్యాయం అందించాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు తెలంగాణ రాష్ట్రం ఇక్కడి బీసీల సంక్షేమం, సమాన అభివృద్ధికి కట్టుబడి ఉందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. "రాజ్యాంగంలోని 243డి(6) ప్రకారం పంచాయతీలు, చైర్‌పర్సన్ల ఖాళీల్లో, 243 టీ(6) ప్రకారం మున్సిపాలిటీల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్రాలకు ఉంది. ఈ నేపథ్యంలో వెనుకబాటుపై అధ్యయనం చేయడంతోపాటు సమన్యాయం జరిగేలా రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నవంబరు 2024లో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అప్పటికే ప్రభుత్వం రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను నిర్వహించింది. రాష్ట్రంలో వేర్వేరు కులాల్లో ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితి సర్వేతో వెల్లడైంది. ఈ సర్వే ద్వారా వెలువడిన డేటాను అధ్యయనం చేసిన ప్రత్యేక కమిషన్... ప్రభుత్వానికి ఈ ఏడాది మార్చిలో నివేదికను అందించింది. రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నప్పటికీ ఆ మేరకు రాజకీయ ప్రాతినిధ్యం లేదని కమిషన్ తెలిపింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో కనీసం 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని నివేదిక సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం బీసీల అభివృద్ధి కోసం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అంగీకరించింది. ఈ మేరకు బీసీ బిల్లు2025ను శాసనసభ, మండలిలలో ప్రవేశపెట్టగా రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. దీంతో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించిన ప్రభుత్వం.. స్థానిక సంస్థలవారీగా 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ జులై 11న ప్రత్యేక కమిషన్‌కు అదనపు నియమ నిబంధనలు జారీ చేసింది. ప్రత్యేక కమిషన్ ఆగస్టు 28న గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సీట్లు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను అందించింది. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించింది" అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది

మొదటి పేజీ తరువాయి

# చరిత్ర పుటల్లోకి మిగ్21



ఈ-కబురు, చండీగఢ్: ఆరు దశాబ్దాలకుపైగా భారత గగనతలాన్ని శాసించిన దిగ్గజ యుద్ధవిమానం మిగ్-21 చరిత్రపుటల్లో కలిసిపోయింది. వైమానిక దళానికి అలుపెరగని సేవలు అందించిన ఈ లోహవిహంగం శాశ్వత విశ్రాంతి తీసుకోనుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన వేడుకలో ఈ ఫైటర్ జెట్‌లను లాంఛనంగా వాయుసేన నుంచి ఉపసంహరించారు. ఈ యుద్ధవిమానం భారత్‌కు గర్వకారణమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశానికి దీనితో బలమైన అనుబంధం ఉందన్నారు.

రష్యా నుంచి కొనుగోలు చేసిన మిగ్-21.. భారత తొలి సూపర్‌సోనిక్ యుద్ధవిమానం. కాలం చెల్లడంతో వాటికి వీడ్కోలు పలకాలని వైమానిక దళం నిర్ణయించింది. వాటి స్థానాన్ని.. దేశీయ తేజస్ యుద్ధ విమానాలతో భర్తీ చేస్తోంది. 1963లో తొలి మిగ్-21 స్క్వాడ్రన్ ఏర్పాటైన చండీగఢ్‌లోనే తాజాగా వీటికి వీడ్కోలు పలకడం విశేషం. ఈ కార్యక్రమంలో అద్భుత వైమానిక విన్యాసాలు జరిగాయి. తొలుత వాయుసేనకు చెందిన 'ఆకాశ్ గంగ' బృందం 8వేల అడుగుల ఎత్తు నుంచి అబ్బురపరిచేలా స్కై డైవింగ్ చేసింది. అనంతరం సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం విన్యాసాలు వీక్షకులను ఊపిరిబిగబట్టేలా చేశాయి. చివరిగా 23వ స్క్వాడ్రన్‌కు చెందిన ఆరు మిగ్-21 యుద్ధవిమానాలు గగనవిహారం చేశాయి. 'బాదల్ 3' సంకేతనామంతో వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ స్వయంగా ఒక యుద్ధవిమానాన్ని నడిపారు. మహిళా పైలట్ ప్రియా శర్మ కూడా ఈ విన్యాసాల్లో పాల్గొన్నారు. దీంతో మిగ్-21ను చివరిసారిగా నడిపిన మహిళా పైలట్‌గా ఆమె గుర్తింపు పొందారు. అనంతరం జల ఫిరంగులతో మిగ్-21లకు వందన సమర్పణ జరిగింది. లాంఛనంగా ఆరు జెట్‌లను 'స్విచ్ఛాఫ్' చేశారు.

మొదటి పేజీ తరువాయి

# మోగనున్న 'స్థానిక' నగారా!

శుక్రవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి బీసీ సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం ముందుకెళ్లాలని, ఎన్నికల సంఘానికి ఈ మేరకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీనికి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు ఇవ్వగా... దీన్ని పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. మరోవైపు వార్డులు, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ రిజర్వేషన్ల ఖరారుపైనా పంచాయతీరాజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

సన్నద్ధతపై సమావేశం

రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ఉదయం స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధతపై ప్రభుత్వపరంగా సమాచారాన్ని సీఎస్, డీజీపీ వివరించనున్నారు. వార్డులు, గ్రామాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, స్ట్రాంగ్ రూంలు, ఎన్నికల సిబ్బంది వివరాలను అధికారులు తెలియజేయనున్నారు. దీని ఆధారంగా ఎన్నికల సంఘం షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకోనుంది.

నేడు మహిళా రిజర్వేషన్ల ఖరారు

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే వార్డులు, గ్రామాలు, మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. రిజర్వ్‌డ్ స్థానాల్లో 50 శాతం స్థానాలను మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో శనివారం ఎంపిక చేస్తారు. మహిళా జడ్పీ చైర్‌పర్సన్ స్థానాలను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హైదరాబాద్‌లో, మహిళా జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కలెక్టర్లు జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారు. ఎంపీడీవోలు వార్డులు, ఆర్డీవోలు గ్రామపంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో మహిళా రిజర్వేషన్ స్థానాలను ఎంపిక చేస్తారు. ఈ మేరకు రాజకీయ పార్టీలకు సమాచారం అందించారు. మహిళా రిజర్వేషన్ల ఖరారు అనంతరం వీటితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లన్నింటికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ శనివారమే జారీ చేస్తారు.

# బిహార్ మహిళల ఖాతాల్లోకి పదేసి వేలు



10వేలు చొప్పున 75లక్షలమంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, పలువురు మంత్రులు సహా పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బిహార్ ఎన్డీయే సర్కారు రూ.7,500కోట్లతో ఈ పథకాన్ని రూపొందించింది. ప్రతి కుటుంబంలోని ఓ మహిళకు జీవనోపాధిలో భాగంగా వారు ఎంచుకున్న రంగంలో ఆర్థికసహాయం అందిస్తారు. మంచి ఫలితాలు సాధిస్తే తదుపరి దశల్లో రూ.2లక్షల వరకు పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, టైలరింగు, నేత, చిన్నతరహా సంస్థల వంటి ఎంపిక చేసిన రంగాల్లో మహిళలకు ఆర్థిక సహాయం చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఆర్జేడీపై విరుచుకుపడ్డారు. ఆర్జేడీ కూటమి రాష్ట్రంలో ఎప్పటికీ అధికారంలోకి రాకుండా మహిళలు అడ్డుకోవాలన్నారు. మీ అభివృద్ధికి పాటుపడే ఇద్దరు సోదరులు (మోదీ, నీతీశ్) ఉన్నార'ని గుర్తుచేశారు.

# డీజీపీగా శివధర్‌రెడ్డి



1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్‌రెడ్డిని డీజీపీ(సమన్వయం)గా నియమిస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు హెడ్ ఆఫ్ ది పోలీస్ ఫోర్స్(హెచ్‌వోపీఎఫ్)గా పూర్తి అదనపు బాధ్యతల్ని అప్పగించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 1న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న డా.జితేందర్ ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తనను డీజీపీగా నియమించినందుకు శివధర్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డినికలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తొలుత లాయర్‌గా.. తర్వాత ఐపీఎస్‌గా..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్(పెద్దతూండ్ల) గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన శివధర్‌రెడ్డి విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే సాగింది. ఉస్మానియా వర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదివిన అనంతరం కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. సివిల్స్ రాసి 1994 బ్యాచ్ ఐపీఎస్‌గా అఖిలభారత సర్వీసుల్లోకి అడుగుపెట్టారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరంగా కీలకమైన సౌత్‌జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. 2007లో మక్కామసీదు బాంబు పేలుళ్లతోపాటు ఆ సమయంలో జరిగిన అల్లర్ల నియంత్రణ క్రమంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో 14మంది మరణించిన అనంతరం అప్పటి ప్రభుత్వం ఆయన్ని అక్కడ నియమించింది. 2003లో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో విధులు నిర్వర్తించారు. డీఐజీగా పదోన్నతి పొందిన అనంతరం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) చీఫ్‌గా నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏసీబీలో అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన అక్కడే ఐజీ హోదాలో డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ సమయంలో వైజాగ్ కమిషనర్‌గా ఉన్న ఆయన్ను అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణ తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించారు. ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్నపుడు నయీంను ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హతమార్చారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం మరోసారి ఆయన్ని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించారు. అక్కడ ఉండగానే గతేడాది ఆగస్టులో ఆయన డీజీపీగా పదోన్నతి పొందారు. ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో ఆయన పనితీరుకు శౌర్యపతకం, ఐపీఎం, పీపీఎం పురస్కారాలు లభించాయి.

# 5లోగా ఫిరాయింపులపై విచారణ!



**6 నుంచి 23 వరకూ సభాపతి విదేశీ పర్యటన**

**న్యాయవాదులను సమకూర్చుకోవాలని ఇరుపక్షాలకు లేఖలు**

**స్పీకర్ సమక్షంలో వాదనలకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలు**

ఈకబురు, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై తమ వివరణలను అఫిడవిట్ రూపంలో ఇప్పటికే అందజేసిన 8 మంది ఎమ్మెల్యేలు.. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేల అభ్యంతరాలు, ఆధారాలపై వచ్చే నెల 5 లోగా విచారణ ముగించాలని శాసన సభాపతి సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వచ్చే నెల 6 నుంచి 12 వరకూ బ్రిడ్జిటౌన్, బార్బడోస్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సులో పాల్గొననున్నారు. దీనికి కొనసాగింపుగా యూకే, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో వచ్చే నెల 12 నుంచి 23 వరకూ స్టడీ టూర్‌లో కొనసాగనున్నారు. ఇవన్నీ ముందస్తుగా కుదుర్చుకున్న కార్యక్రమాల దృష్ట్యా.. ఆ లోగానే విచారణ ముగించాలనే నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఇరుపక్షాలకు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు లేఖలు పంపించారు. "శాసన సభాపతి ముందస్తుగా నిర్ణయించిన విదేశీ పర్యటనల దృష్ట్యా వచ్చే నెల 5లోగా విచారణ ముగించేలా సహకరించండి. మీ తరఫున వాదనలు వినిపించేందుకు అడ్వొకేట్‌ను నియమించుకొని వారి వివరాలను 26లోగా తెలియపర్చండి. విచారణ తేదీలను ఖరారు చేస్తాం" అని శాసనసభ కార్యదర్శి తన లేఖలో ఎమ్మెల్యేలను కోరారు. దీంతో ఇరు పక్షాలు శుక్రవారం తమ న్యాయవాదుల వివరాలు సమర్పించాయి.

**29న తొలివిడత విచారణ ప్రారంభించే అవకాశం**

పార్టీ ఫిరాయింపులపై తమపై వచ్చిన ఫిర్యాదులకు ఆయా ఎమ్మెల్యేలు ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శికి తమ వివరణలను అఫిడవిట్ రూపంలో అందజేశారు. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేలు తాము కూడా ఆ ఎమ్మెల్యేలిచ్చిన వివరణలపై అభ్యంతరాలను న్యాయ సమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయంలో అందించారు. 3 నెలల్లోగా పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల గడువు వచ్చే నెల 30తో ముగియనుంది. అయితే వచ్చే నెలలో 6 నుంచి 23 వరకూ స్పీకర్ విదేశీ పర్యటనలో ఉంటుండడంతో.. ఆలోగా విచారణ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు పార్టీ ఫిరాయింపు నోటీసులు ఇవ్వగా.. ఇందులో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తమ వివరణలను అందజేశారు. ఇరుపక్షాల వివరణలు, అభ్యంతరాలు న్యాయసమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయానికి చేరడంతో విచారణకు శాసనసభాపతి కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 29 నుంచే స్పీకర్ సమక్షంలో విచారణ ప్రారంభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సోమ, మంగళ, బుధవారాల్లో తొలివిడత.. తిరిగి వచ్చే 3, 4, 5 తేదీల్లో మలిదశ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఇరుపక్షాల వాదనల అనంతరం.. తన నిర్ణయాన్ని సభాపతి అక్టోబరు 30లోగా సుప్రీంకోర్టుకు నివేదించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# హైదరాబాద్‌లో భారీ వర్షం..

పరిస్థితిని స్వయంగా అర్ధరాత్రి సమీక్షించారు.
మూసీ అంతకంతకు పెరగడంతో పరీవాహక కాలనీల్లో జనాలు అర్ధరాత్రి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్(గండిపేట) నిండుకుండలా ఉన్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎగువన కురిసిన వర్షాలతో జంట జలాశయాల్లోకి ప్రవాహం పెరిగింది. దీంతో 13,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి ప్రవాహం పెరగడంతో రాత్రి 8 గంటల తర్వాత 35 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో మూసీ పొడవునా భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల కాలంలో ఇంత ప్రవాహం మూసీలో ఎప్పుడూ లేదు. మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద పురోగతిలో ఉన్న పైవంతెన నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది.
నదికి ఇరువైపులా అంబేడ్కర్ బస్తీతో సహా పలు కాలనీలు నీట మునిగాయి. అధికారులు వందల మందిని సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. మూసానగర్, శంకర్‌నగర్ బస్తీల్లోని పలు కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేయకపోవడంతో పోలీసులు బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ రెండు వంతెనలపై వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపేశారు. దాని ప్రభావంతో దిల్‌సుఖ్‌నగర్, కోఠి మధ్య ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నార్సింగి వద్ద ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్లు మూసుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం తలెత్తింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ కోరారు. పటాన్‌చెరు వైపు జాతీయ రహదారి నీట మునిగింది.
హైటెక్‌సిటీలో రహదారులపై నీరు నిలవడంతో బల్దియా అధికారులు మోటార్లతో వరదను దారి మళ్లించారు. దీంతో కుల్సుంపుర నుంచి పురానాపూల్ వరకు, చాదర్‌ఘాట్ కాజ్‌వే వంతెన, మూసారాంబాగ్ బ్రిడ్జి వరకు రహదారులను పూర్తిగా మూసివేసి పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పటాన్‌చెరు మండలంలో ఇస్నాపూర్ నుంచి రుద్రారం మధ్య 65వ జాతీయ రహదారి మీదుగా మోకాలి లోతు వరద ప్రవహించింది. ఈసీ, మూసీ వాగులు ఇరువైపులా పంట పొలాలను ముంచెత్తుతూ ప్రవహిస్తున్నాయి. మొయినాబాద్, శంషాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, గండిపేట మండలాలకు చెందిన రైతుల పంటలన్నీ వరదలో చిక్కుకుపోయాయి. శంషాబాద్ విమానాశ్రయంలో దిగాల్సిన పలు విమానాలను వాతావరణం అనుకూలంగా లేని కారణంగా శుక్రవారం విజయవాడకు తరలించారు. ముంబయి, కోల్‌కతా, పుణె నుంచి వచ్చిన మూడు ఇండిగో విమానాలకు శంషాబాద్‌లో దిగడానికి అనుమతి లభించలేదు.

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తంగా మార్చాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అత్యధికంగా జనగామ జిల్లా జఫర్‌గఢ్‌లో 10.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో 9.8, సంగారెడ్డి జిల్లా హత్నూరలో 9, వికారాబాద్‌లో 8.6 సెం.మీ. కురిసింది. భూపాలపల్లి, రంగారెడ్డి, ఆసిఫాబాద్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ములుగు జిల్లాలో వాజేడు మండలం టేకులగూడెం వద్ద హైదరాబాద్‌భూపాలపట్నం 163వ జాతీయ రహదారిపై నీరు చేరడంతో అంతర్రాష్ట్ర మార్గంలో రవాణా నిలిచింది. వెంకటాపురం మండలంలో పలుచోట్ల మిర్చి పంటలు నీట మునిగాయి. వికారాబాద్ జిల్లాలోని శివాజీ బ్రిడ్జి కింద భూలక్ష్మి ఆలయం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 55 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

రెండు రోజులు భారీ వర్షాలు

తీవ్ర అల్పపీడనం పశ్చిమ దిక్కులో కదులుతూ మరింత బలపడి వాయవ్య, దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా మారి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరం సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## మత్తయ్యపై ఎఫ్ఐఆర్ కొట్టివేతను సమర్థించిన సుప్రీంకోర్టు



ఈ-కబురు, ఢిల్లీ: ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న జెరూసలేం మత్తయ్యపై 2015 మే 31న నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం 2016లో దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్‌గవాయ్, జస్టిస్ వినోద్‌చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈనెల 22న దీనిపై తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం శుక్రవారం ఆరుపేజీల ఉత్తర్వులను వెలువరించింది. "హైకోర్టు న్యాయమూర్తి పేజీల కొద్దీ తీర్పు రాశారు. అందులో ఎఫ్ఐఆర్ కొట్టేయడానికి అవసరమైన కారణాలు చూపారు. లావాదేవీ జరిగినట్లు చెబుతున్నరోజు ఎ-4 మత్తయ్య సంఘటనాస్థలంలో లేరు. అందువల్ల నేరంతో ఎ-4కు సంబంధంలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. ఇదే కేసులో తన ప్రమేయం లేనందున తనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎన్నికలకు సంబంధించిన ఈ వ్యవహారం ఏసీబీ పరిధిలోకి రాదు కాబట్టి ఆ చట్టం కింద నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు 2021లో దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై విచారణ అక్టోబరు 14వ తేదీకి వాయిదా పడింది. శుక్రవారం ఈ కేసులు జస్టిస్ జేకేమహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఇదే కేసులో మత్తయ్యపై ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ ఇచ్చిన తెలంగాణ హైకోర్టు తీర్పును సీజేఐ ధర్మాసనం సమర్థించిందన్న విషయం.. ఈ ధర్మాసనం దృష్టికి తేవడంతో ఆ తీర్పు కాపీని సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది.రు" అని కేసీఆర్ పేర్కొన్నారు.

## నలుగురు తెలుగు వారికి జాతీయ భూవిజ్ఞాన శాస్త్ర పురస్కారాలు



ఈకబురు, ఢిల్లీ: ఆమనగల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా నలుగురు తెలుగువారు శుక్రవారం దిల్లీలో జాతీయ భూవిజ్ఞాన శాస్త్ర పురస్కారాలు(నేషనల్ జియోసైన్స్ అవార్డ్స్) అందుకున్నారు. దిల్లీలోని రాష్ట్రపతిభవన్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్రపతి మొత్తం 20 మంది శాస్త్రవేత్తలను మూడు కేటగిరీల్లో మొత్తం 12 పురస్కారాలతో గౌరవించారు. 2024వ సంవత్సరానికి సంబంధించి ఒక లైఫ్‌టైం అచీవ్‌మెంట్, ఒక నేషనల్ యంగ్ జియో సైంటిస్ట్, 10 జాతీయ భూవిజ్ఞాన శాస్త్ర పురస్కారాలు ఉన్నాయి. ఖనిజాన్వేషణలో అద్భుతమైన పనితీరు కనబరిచినందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందానికి రాష్ట్రపతి జాతీయ భూవిజ్ఞాన శాస్త్ర పురస్కారం ప్రదానం చేయగా అందులో తెలుగువారు సంగంరెడ్డి శ్యాంకుమార్, సామల సాయికుమార్ ఆ గౌరవాన్ని అందుకున్నారు. సాయికుమార్ రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు చెందినవారు. ఒడిశా రాష్ట్రం మయూర్భంజ్ జిల్లాలోని మదన్సాహి కేశపూర్ దుధియాసోల్ ప్రాంతాల్లో రాగి, నికెల్, అనుబంధ ఖనిజాల అన్వేషణలో చేసిన కృషికి పురస్కారం దక్కింది. ప్రాథమిక, సాధారణ అన్వేషణల ద్వారా 37.77 మిలియన్ టన్నుల రాగి, 2.05 మిలియన్ టన్నుల నికెల్‌తో పాటు బంగారం, వెండి, కోబాల్ట్, కాడ్మియం, యురేనియం గుర్తించినట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. హైదరాబాద్ సీఎస్ఐఆర్‌నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్‌కి చెందిన ముఖ్య శాస్త్రవేత మేకల రామ్మోహన్ జియో సైన్సెస్‌లో చేసిన పరిశోధనలకు వ్యక్తిగత ప్రతిభా పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. విశాఖపట్నం సీఎస్ఐఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ముఖ్యశాస్త్రవేత్త వేదుల వెంకట సుబ్రహ్మణ్య శ్రీనివాసశర్మ వ్యక్తిగత ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. హిందూ మహాసముద్రంలో బయోకెమికల్ ప్రాసెస్‌లో వస్తున్న తేడాలపై ఆయన చేసిన పరిశోధనలకు ఈ గౌరవం దక్కింది.

## పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం: రాజస్థాన్ సీఎం

, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ అన్నారు. ప్రభుత్వం కల్పించిన అపార అవకాశాలను అందిపుచ్చుకుని పెట్టుబడుల ద్వారా ఇరురాష్ట్రాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రంలో స్థిరపడిన రాజస్థానీయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన 'ప్రవాసీ రాజస్థాన్ సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిసెంబరు 10న రాజస్థాన్‌లో జరగనున్న 'ప్రవాసీ రాజస్థాన్ దివస్'కి రావాలని శర్మ వారిని ఆహ్వానించారు. రాజస్థాన్‌లో రైజింగ్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సందర్భంగా రూ.35 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో భాజపా తెలంగాణ రాష్ట్రాధ్యక్షుడు రామచందర్‌రావు, రాజస్థాన్ మంత్రి విష్ణోయ్, రాష్ట్ర సీసీఐ మాజీ ఛైర్మన్ సాయి డి.ప్రసాద్, రాజస్థాన్ ఫౌండేషన్ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యక్షుడు పవన్‌కుమార్ భన్సాల్ పాల్గొన్నారు.

వచ్చే నెల 3 నుంచి 'జీతో కనెక్ట్' ప్రదర్శన

జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీతో) ఆధ్వర్యంలో తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అక్టోబరు 3, 4, 5 తేదీల్లో 'జీతో కనెక్ట్' పేరుతో హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను జీతో ఛైర్మన్ రోహిత్ కఠారి వివరించారు.




## పత్తి కొనుగోళ్లు జరిగేనా!



### నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ యత్నాలు
### సీసీఐ టెండర్లకు జిన్నింగ్ మిల్లుల దూరం

ఈకబురు,హైదరాబాద్: తెలంగాణలో పత్తి కొనుగోళ్లను వచ్చే నెల 1 నుంచి ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) టెండర్లలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పాల్గొనకపోవడం ప్రతిబంధకంగా మారింది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు మరో వారం రోజులే ఉండగా.. సీసీఐ, మిల్లర్ల మధ్య వివాదం ముగియకపోవడంపై ప్రభుత్వవర్గాలతోపాటు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పత్తి కొనుగోలు, ఆ తర్వాత శుద్ధి చేసి, బేళ్లుగా కట్టి రవాణా చేసే పని కోసం జాబ్‌వర్క్ టెండర్లను సీసీఐ పిలుస్తోంది. రాష్ట్రంలో 380 కాటన్ జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వాటిలో 322 గతేడాది టెండర్లలో పాల్గొని జాబ్ వర్క్ చేస్తున్నాయి. 202526 కొనుగోళ్ల సీజన్ కోసం సీసీఐ మరోసారి జాబ్‌వర్క్ నిబంధనల్లో మార్పులు చేసింది. దానికి అనుగుణంగా గత నెల 9న సీసీఐ టెండర్లను పిలిచింది. ఇందులో నిబంధనలు కఠినంగా ఉన్నాయనే కారణంతో గత నెల 31 వరకు జరిగిన మొదటి విడత టెండర్లలో ఒక్క మిల్లు కూడా పాల్గొనలేదు. దీంతో ఈ నెలలో మరోసారి సీసీఐ టెండర్లు పిలిచింది. రెండో దఫా గడువు ముగుస్తుండగా.. ఈ సారి సైతం మిల్లర్లు టెండర్లకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల చివరి వారంలో మూడో విడత టెండర్లను పిలవాలని సీసీఐ భావిస్తోంది. మరోవైపు నిబంధనలు మారిస్తేనే టెండర్లలో పాల్గొంటామని మిల్లర్లు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రయత్నాలు..

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పత్తి కొనుగోళ్ల సీజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబరు 1 నుంచి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నా.. కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై సందిగ్ధం ఏర్పడింది. సీఐఐ కొనుగోళ్లు ప్రారంభంగాని పక్షంలో రైతులు.. దళారులను ఆశ్రయించి నష్టపోయే ప్రమాదం ఉంది. సీసీఐ, మిల్లర్ల మధ్య వివాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ సీఎండీకి లేఖ రాసింది. వెంటనే మిల్లర్ల సమస్యలను పరిష్కరించి కొనుగోళ్లు నిర్ణీత గడువు మేరకు చేపట్టాలని కోరింది. సీసీఐ నుంచి స్పందన రాని పక్షంలో మంత్రి తుమ్మల ఆ సంస్థ అధికారులు, మిల్లర్ల సంఘం నేతలతో సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



ఈ-కబురు, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, అధికారంలోకి వచ్చిన 22 నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారాస అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతా గోపీనాథ్ పేరును ప్రకటించారు. ఎర్రవల్లి నివాసంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, పద్మారావుగౌడ్, సబితా ఇంద్రారెడ్డి తదితరులతో ఈ ఉప ఎన్నికపై శుక్రవారం కేసీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, పద్మారావుగౌడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్‌లతో సమీక్షిస్తున్న భారాస అధినేత కేసీఆర్

పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వైద్య పరీక్షల నిమిత్తం ఈ సమీక్షకు హాజరు కాకపోవడంతో ఆయనతో కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలో సీనియర్ నేతగా, సిటింగ్ ఎమ్మెల్యేగా ఉంటూ దివంగతులైన గోపీనాథ్.. జూబ్లీహిల్స్ ప్రజల అభిమాన నాయకుడిగా వారి మనసులో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఆయన మరణం వల్ల జరగనున్న ఉప ఎన్నికలో మాగంటి కుటుంబానికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు కేసీఆర్ తెలిపారు. ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం గులాబీ అధినేత మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. ఈ ఉపఎన్నికలో భారాసకే గెలుపు అవకాశాలున్నాయి. పలు సర్వేలు, నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ విజయం మనకు కీలకం. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలి. ఓటర్లలో అవగాహన కల్పించాలి. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషిచేయాలి. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలి" అని కేసీఆర్ సూచించారు.

## జూబ్లీహిల్స్ భారాసకు కంచుకోట



యూసుఫ్‌గూడ: జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని మాగంటి గోపీనాథ్ భారాసకు కంచుకోటగా మార్చారని పార్టీ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల మనిషిగా పేరు పొందిన గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఆయనను ఆదరించినట్టే తనకూ మద్దతుగా ఉండి గెలిపించాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించిన భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

మాగంటి సునీత ప్రొఫైల్
పేరు : మాగంటి సునీత
వృత్తి: గృహిణి, ప్రస్తుతం రాజకీయాలు
వయస్సు: 54 సంవత్సరాలు
విద్యార్హత: పదో తరగతి (డిస్ కంటిన్యూ)
పిల్లలు: కుమార్తెలు అక్షరనాగ, దిశిర, కుమారుడు వాత్సల్యనాథ్

## చాకలి ఐలమ్మ, మన్మోహన్‌సింగ్‌లకు సీఎం నివాళులు



ఈకబురు, దరాబాద్: వీరనారి చాకలి ఐలమ్మ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో శుక్రవారం వారి చిత్రపటాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఐలమ్మ చిత్రపటానికి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ కార్యదర్శి డా.నరసింహాచార్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఐలమ్మ ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం: కేసీఆర్

చిట్యాల ఐలమ్మ ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆమె పోరాట స్ఫూర్తిని కేసీఆర్ స్మరించుకున్నారు. "పాలకులు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలను అటు న్యాయస్థానాల్లో.. ఇటు క్షేత్రస్థాయిలోనూ పోరాడి గెలవాలనే ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తిని చిట్యాల ఐలమ్మ తెలంగాణ సమాజానికి అందించారు

## ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో.. ప్రజలపై రూ.15వేల కోట్ల అప్పుల భారం

### కక్ష సాధింపు భరించలేకే మెట్రో నుంచి ఎల్ అండ్ టీ నిష్క్రమణ
### దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించాలి: కేటీఆర్

ఈకబురు, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై తమ వివరణలను అఫిడవిట్ రూపంలో ఇప్పటికే అందజేసిన 8 మంది ఎమ్మెల్యేలు.. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేల అభ్యంతరాలు, ఆధారాలపై వచ్చే నెల 5 లోగా విచారణ ముగించాలని శాసన సభాపతి సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వచ్చే నెల 6 నుంచి 12 వరకూ బ్రిడ్జిటౌన్, బార్బడోస్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సులో పాల్గొననున్నారు. దీనికి కొనసాగింపుగా యూకే, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో వచ్చే నెల 12 నుంచి 23 వరకూ స్టడీ టూర్‌లో కొనసాగనున్నారు. ఇవన్నీ ముందస్తుగా కుదుర్చుకున్న కార్యక్రమాల దృష్ట్యా.. ఆ లోగానే విచారణ ముగించాలనే నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఇరుపక్షాలకు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు లేఖలు పంపించారు. "శాసన సభాపతి ముందస్తుగా నిర్ణయించిన విదేశీ పర్యటనల దృష్ట్యా వచ్చే నెల 5లోగా విచారణ ముగించేలా సహకరించండి. మీ తరఫున వాదనలు వినిపించేందుకు అడ్వొకేట్‌ను నియమించుకొని వారి వివరాలను 26లోగా తెలియపర్చండి. విచారణ తేదీలను ఖరారు చేస్తాం" అని శాసనసభ కార్యదర్శి తన లేఖలో ఎమ్మెల్యేలను కోరారు. దీంతో ఇరుపక్షాలు శుక్రవారం తమ న్యాయవాదుల వివరాలు సమర్పించాయి.

29న తొలివిడత విచారణ ప్రారంభించే అవకాశం

పార్టీ ఫిరాయింపులపై తమపై వచ్చిన ఫిర్యాదులకు ఆయా ఎమ్మెల్యేలు ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శికి తమ వివరణలను అఫిడవిట్ రూపంలో అందజేశారు. వారిపై ఫిర్యాదు చేసిన భారాస ఎమ్మెల్యేలు తాము కూడా ఆ ఎమ్మెల్యేలిచ్చిన వివరణలపై అభ్యంతరాలను న్యాయ సమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయంలో అందించారు. 3 నెలల్లోగా పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల గడువు వచ్చే నెల 30తో ముగియనుంది. అయితే వచ్చే నెలలో 6 నుంచి 23 వరకూ స్పీకర్ విదేశీ పర్యటనలో ఉంటుండడంతో.. ఆలోగా విచారణ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు పార్టీ ఫిరాయింపు నోటీసులు ఇవ్వగా.. ఇందులో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తమ వివరణలను అందజేశారు. ఇరుపక్షాల వివరణలు, అభ్యంతరాలు న్యాయసమీక్షకు అనుగుణంగా స్పీకర్ కార్యాలయానికి చేరడంతో విచారణకు శాసనసభాపతి కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 29 నుంచే స్పీకర్ సమక్షంలో విచారణ ప్రారంభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సోమ, మంగళ, బుధవారాల్లో తొలివిడత.. తిరిగి వచ్చే 3, 4, 5 తేదీల్లో మలిదశ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఇరుపక్షాల వాదనల అనంతరం.. తన నిర్ణయాన్ని సభాపతి అక్టోబరు 30లోగా సుప్రీంకోర్టుకు నివేదించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



# సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్:

## క్రాష్ టెస్ట్‌లో ఇన్విక్టో రికార్డ్!



మారుతి సుజుకి ఇన్విక్టో.. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ పరీక్షలో 5 స్టార్ రేటింగ్ సాధించింది. దీంతో ఈ ఎంపీవీ దేశంలోని అత్యంత సురక్షితమైన కార్ల జాబితాలో ఒకటిగా నిలిచింది.

మారుతి ఇన్విక్టో.. వయోజన ప్రయాణీకుల రక్షణలో 32 పాయింట్లకు 30.43 పాయింట్లు స్కోర్ చేయగలిగింది. పిల్లల రక్షణలో 49 పాయింట్లకు 45 పాయింట్లు సాధించింది. ఫ్రంటల్ ఆఫ్‌సెట్ డిఫార్మబుల్ బారియర్ టెస్ట్‌లో 16 పాయింట్లకు 14.43 పాయింట్లు సాధించగా, సైడ్ మూవబుల్ డిఫార్మబుల్ బారియర్ టెస్ట్‌లో 16 పాయింట్లు పరిపూర్ణ స్కోరు లభించింది. ఇలా మొత్తం మీద సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకుంది.

భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ పరీక్షకు ఉపయోగించిన కారు.. 6 ఎయిర్‌బ్యాగులు కలిగి ఉంది. అంతే కాకుండా ఫ్రంట్ అండ్ రియర్ డిస్క్ బ్రేక్‌లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో హోల్డ్‌తో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఏబీఎస్ విత్ ఈబీడీ, హిల్ హోల్డ్ అసిస్ట్‌తో, 3-పాయింట్ సీట్ బెల్ట్‌లు, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ యాంకరేజ్, 360 డిగ్రీ వ్యూ కెమెరా వంటి సేఫ్టీ ఫీచర్స్ కూడా పొందింది.

# అనిశ్చితిలోనూ పటిష్టంగా భారత్: నిర్మలా సీతారామన్



అంతర్జాతీయంగా అనిశ్చితి వల్ల పలు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ పటిష్టంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. యువ జనాభా, దేశీయంగా డిమాండ్ మెరుగ్గా ఉండటం, స్థిరమైన ఆర్థిక విధానాలు ఎకానమీ వృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు.బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 91వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె ఈ విషయాలు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని, ఎస్అండ్‌పీలాంటి రేటింగ్ ఏజెన్సీలు కూడా దేశ రేటింగ్‌ను పెంచాయని మంత్రి చెప్పారు. భారత్‌పై ప్రపంచానికి గల నమ్మకానికి ఇది నిదర్శనమని వివరించారు. వృద్ధి సాధనలో కీలక పాత్ర పోషించే బ్యాంకులు, కస్టమర్ల నమ్మకాన్ని చూరగొనడం, ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడంపై మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు.

# వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌కు అధిక ప్రాధాన్యమిస్తే: గూగుల్ మాజీ సీఈఓ కీలక వ్యాఖ్యలు



వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి గూగుల్ మాజీ సీఈఓ ఎరిక్ స్మిత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ విధానానికి అతి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పోటీతత్వం దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. అలాగే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి కూడా తాను వ్యతిరేకమని వెల్లడించారు.

''టెక్ రంగంలో విజయం సాధించాలంటే కొన్ని విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుంది. పనిజీవన సమతుల్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పోటీతత్వం దెబ్బతింటుంది. ఇక ఇంట్లో ఉండి పనిచేయడం వల్ల నేర్చుకోవడం కుంటుపడుతుంది. వర్క్‌ఫ్రమ్ హోమ్ వల్ల మార్గదర్శకత్వ లోటు ఏర్పడుతుంది. ఆవిష్కరణలపై ప్రభావం పడుతుంది'' అని ఎరిక్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు.

ధనవంతులు కావాలంటే సిప్ ఒక్కటే చాలదు యూఎస్ సాంకేతికరంగం చైనా నుంచి సవాలు ఎదుర్కొంటోందని అన్నారు. అక్కడ చాలా సంస్థలు '996' పని సంస్కృతి అవలంబిస్తుంటాయి. దానిప్రకారం.. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది వరకు ఆరు రోజుల పాటు సిబ్బంది విధుల్లో ఉంటారు. అధిక పని గంటలకు వ్యతిరేకంగా అక్కడ చట్టాలు ఉన్నప్పటికీ.. ఇదే విధానం కొనసాగిస్తున్నారని ఆయన వెల్లడించారు. దీని ద్వారా అమెరికా వ్యాపారాలు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి వల్లే కృత్రిమ మేధ విషయంలో కాస్త వెనకబడిందని గతంలో గూగుల్ (Google)పై ఆయన ఘాటు విమర్శలు చేశారు కూడా. కాగా.. కరోనా సమయంలో టెక్ సంస్థలు వర్క్ ఫ్రమ్‌హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం కొన్ని సంస్థలు ఉద్యోగులు కార్యాలయాలకు రావాలని ఆదేశించగా.. మరికొన్ని హైబ్రిడ్ మోడల్‌లో పనిచేయించుకుంటున్నాయి. ఈ క్రమంలో ఈ అంశంపై ఇప్పటికీ చర్చ నడుస్తోంది.

# డిజిటల్ చెల్లింపులకు కొత్త మార్గదర్శకాలు

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్ఏ) కింద ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీకి అదనంగా మరిన్ని మార్గాలకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. పాస్‌వర్డ్, ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీ, పాస్‌ఫ్రేజ్, పిన్, కార్డ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టోకెన్, ఫింగర్‌ప్రింట్ లేదా ఇతర బయోమెట్రిక్స్ (ఆధార్ ఆధారిత) ఆథెంటికేషన్‌కు వీలు కల్పించింది.వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2ఎఫ్ఏ తప్పనిసరి అంటూ, ఇకపైనా ఎస్ఎంఎస్ ఓటీపీని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎస్ఎంఎస్ ఓటీపీకి అదనంగా ఇతర ప్రత్యామ్నాయ ఆథెంటికేషన్ కోసం చెల్లింపుల వ్యవస్థలను అప్‌గ్రేడేషన్ చేసుకోవాలంటూ 2024 ఫిబ్రవరిలోనే ఆర్‌బీఐ కోరడం గమనార్హం.




# ఏటీఎం నుంచి పీఎఫ్ విత్‌డ్రా: ముహూర్తం ఫిక్స్!

ఈపీఎఫ్ఓ డబ్బును ఏటీఎం నుంచి తీసుకోవడానికి కావలసిన ఏర్పాట్లు జరుగుతున్నట్లు.. కేంద్ర కార్మిక & ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ ఏడాది ప్రారంభంలోనే పేర్కొన్నారు. ఇది జూన్ నుంచి అమలులోకి రానున్నట్లు గతంలో కొన్ని వార్తలు వినిపించినప్పటికీ.. ఈ సౌకర్యం 2026 జనవరికి అందుబాటులో వచ్చే అవకాశం ఉంది. ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ , వచ్చే నెల మొదటి అర్ధభాగంలో ఒక సమావేశం ఏర్పాటు చేయనుంది. ఆ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదన చేపట్టే అవకాశం ఉంది. ఆ తరువాత ఏటీఎం నుంచి పీఎఫ్ అమౌంట్ విత్‌డ్రా అందుబాటులోకి వస్తుంది.చందాదారులు తమ పీఎఫ్ డబ్బును తీసుకోవడం మరింత సులభతరం చేయడంలో భాగంగానే.. ఈపీఎఫ్ఓ 3.0 కింద ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసుకునే సదుపాయం కల్పిస్తోంది. ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి మంత్రిత్వ శాఖ బ్యాంకులతో పాటు ఆర్‌బీఐతో కూడా మాట్లాడినట్లు సమాచారం.ప్రస్తుతం ఈపీఎఫ్ఓ కార్పస్ మొత్తం రూ. 28 లక్షల కోట్ల కంటే ఎక్కువ ఉంది. మొత్తం సహకార సభ్యులు దాదాపు 78 మిలియన్లు. అత్యవసర సమయంలో ఉద్యోగులు తమ ఈపీఎఫ్ఓలో కొంత భాగాన్ని తీసుకోవాలంటే.. ఆన్‌లైన్‌లో అప్లై చేసి కొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది. ఇది కొంత ఆలస్యమైనా ప్రక్రియ. ఈ ఆలస్యానికి చెక్ పెట్టడానికే ఏటీఎం నుంచి పీఎఫ్ డబ్బును తీసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నారు.



# మా ప్రపంచం వేరు రష్మిక..



ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా ప్రధానపాత్రల్లో నటించిన హారర్ మిస్టరీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ చిత్రానికి 'ముంజ్య' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ చిత్రంలో అలోక్‌పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కాపాత్రలో రష్మికా మందన్నా నటించారు.

ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ముంబైలో జరిగింది. శ్రద్ధా కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. "ఏ... నాటకాలు ఆపు... నీకేం కాలేదు, నా కొడుకు సైతాన్... సైతాన్, నేను నీతో ఉండలేను... మా ప్రపంచం వేరు" అని అర్థం వచ్చే డైలాగ్స్ ఈ హిందీ ట్రైలర్‌లో ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా 'థామా' సినిమాను అక్టోబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు.

# అనగనగా ఒక రాజు.. నవ్వులు తెప్పిస్తోన్న నవీన్, మీనాక్షి!



జాతిరత్నాలు ఫేమ్ నవీన్ పోలిశెట్టి తాజాగా నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు . ఈ చిత్రంలో గుంటూరు కారం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచింది. ఈ మూవీకి మారి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేయగా.. సినీ ప్రియులను తెగ నవ్వించేసింది.ఇంకా ఈ మూవీ రిలీజ్‌కు దాదాపు మూడు నెలలకు పైగానే సమయం ఉంది. అయినప్పటికీ మేకర్స్ ముందుగానే ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో హీరో, హీరోయిన్లు నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి చాలా సరదాగా నవ్వులు పండించారు. సినిమా ప్రమోషన్‌లో 24 క్యారెట్స్ గోల్డ్ అంటూ ఫన్నీగా ప్రోమోలో మెప్పించారు. ఇంకెందుకు ఆలస్యం ఈ ప్రోమోను చూసి ఎంజాయ్ చేయండి.

# అల్లు ఫ్యామిలీ నుంచి త్వరలో పెళ్లి న్యూస్?



అల్లు ఫ్యామిలీలో రాబోయే కొన్ని నెలల్లో పెళ్లి జరగబోతుందనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తుంది. బన్నీ సోదరుడు శిరీష్.. ప్రస్తుతం కొత్తగా సినిమాలేం చేయట్లేదు. చివరగా గతేడాది 'బడ్డీ' అనే మూవీతో ప్రేక్షకుల్ని పలకరించాడు. తర్వాత నుంచి అటు ఇండస్ట్రీలో గానీ ఇటు సోషల్ మీడియాలో గానీ పెద్దగా యాక్టివ్‌గా లేడు. అలాంటిది ఇప్పుడు ఇతడు త్వరలో వివాహం చేసుకోనున్నాడని మాట్లాడుకుంటున్నారు.హైదరాబాద్‌కి చెందిన ఓ బిజినెస్‌మ్యాన్ కుమార్తెతో శిరీష్‌కి పెళ్లి చేయాలని పెద్దలు అనుకున్నారని.. ఇంతలో అల్లు అరవింద్ తల్లి కనకరత్నం చనిపోవడంతో ఇది కాస్త వాయిదా పడిందని వినిపిస్తుంది. వెంటనే కానప్పటికీ రాబోయే కొన్ని నెలల్లో అల్లు ఫ్యామిలీ నుంచి శుభవార్త అయితే రానుందనే టాక్ వినిపిస్తుంది.మెగా ఫ్యామిలీలో రామ్ చరణ్, అల్లు అర్జున్, వరుణ్ తేజ్ ఇప్పటికే పెళ్లి చేసుకున్నారు. తండ్రులు కూడా అయిపోయారు. నిహారిక వివాహం చేసుకుంది కానీ వ్యక్తిగత కారణాలతో విడాకులు తీసుకుంది. శిరీష్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ ప్రస్తుతానికి సింగిల్‌గా ఉన్నారు. వీళ్లలో ఇప్పుడు శిరీష్.. పెళ్లి చేసుకోబోతున్నాడనే న్యూస్ అయితే వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతనేది తెలియాల్సి ఉంది.

# అందుకే చిరంజీవి, రామ్‌చరణ్‌లతో సినిమాలు చేయలేదు: సుజీత్

స్టైలిష్ మేకింగ్‌తో విశేష క్రేజ్ సొంతం చేసుకున్నారు దర్శకుడు సుజీత్ . పవన్ కల్యాణ్ హీరోగా ఆయన తెరకెక్కించిన 'ఓజీ' గురువారం విడుదలై, కలెక్షన్ల పరంగా రికార్డులు నెలకొల్పుతోంది. ఈ సందర్భంగా సుజీత్ పలు ఇంటర్వ్యూల్లో పాల్గొని, ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. చిరంజీవి, రామ్‌చరణ్‌లతో వేర్వేరుగా సినిమాలు చేయాలనుకున్నా ఎందుకు సాధ్యపడలేదు? 'అతడు', 'ఓజీ'లకు సారూప్యత ఏంటి?

చిరంజీవితో అలా.. రామ్‌చరణ్‌తో ఇలా"'సాహో' తర్వాత విరామం తీసుకోవాలని నేను అనుకోలేదు. ఆ మూవీ విడుదలైన వెంటనే రామ్‌చరణ్‌తో యూకే బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా చేయాలనుకున్నా. అదే సమయంలో కొవిడ్ మొదలైంది. షూటింగ్ చేసే అవకాశం లేదు. ఆ ప్రాజెక్టు ఆలస్యమవుతూ వస్తుండటంతో 'లూసిఫర్' రీమేక్‌కు సంబంధించి చిరంజీవి సర్‌ని కలిశా. ఆ మూవీ డైరెక్టర్, యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్, సినిమాటోగ్రాఫర్ సుజీత్ వాసుదేవ్‌తోనూ మాట్లాడా. 'సాహో' కథా ప్రపంచం తనకు నచ్చిందని పృథ్వీరాజ్ చెప్పారు. నా ఒరిజినల్ ప్రొడక్ట్ వాళ్లకు నచ్చి, సినిమా చేసే అవకాశం ఇవ్వాలనుకున్నారు. అలాంటప్పుడు 'రీమేక్ అవసరమా?' అని నాకే అనిపించింది" అని సుజీత్ తెలిపారు.

'అతడు' పార్థు

పవన్ కల్యాణ్- సుజీత్ కాంబో ఖాయం కావడానికి ప్రధాన కారణం దర్శకుడు త్రివిక్రమ్ అన్న సంగతి తెలిసిందే. త్రివిక్రమ్ లేనిదే ఈ ప్రాజెక్టు లేదని నిర్మాత డీవీవీ దానయ్య అన్నారంటే ఆయన ఎంత చొరవ తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. సుజీత్ ఫేవరెట్ చిత్రాల్లో త్రివిక్రమ్ తెరకెక్కించిన 'అతడు' ఒకటి. ఆ సినిమాని ఎన్నోసార్లు చూసి, బ్రేక్‌డౌన్ చేశారట. అలా.. 'అతడు'లో పార్థు పాత్ర మరణంతో అసలు కథ మొదలైనట్టే.. 'ఓజీ'లోనూ అదే పాత్ర పేరు చావుతో అసలు స్టోరీ ప్రారంభమవుతుంది.

'జానీ' గీత

పవన్ కల్యాణ్ సినిమాల్లో 'జానీ' అంటే సుజీత్‌కు చాలా ఇష్టం. ఆ చిత్రాన్ని చూశాకే ఎప్పటికైనా పవన్‌ను కలవాలనుకున్నారట. ఇప్పుడు తన ఫేవరెట్ హీరోతోనే సినిమా చేసి, విజయం అందుకున్నారు. 'జానీ' హీరోయిన్ పాత్ర పేరు గీత. 'ఓజీ'లో శ్రియారెడ్డి పోషించిన పాత్ర పేరూ అదే. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ కావడంతో కీలక పాత్రలకు పాత పేర్లే పెట్టాలనుకున్నామని, ఆ జాబితాలో గీత ఉండటంతో ఆటోమేటిక్‌గా ఆ పేరుపైనే దృష్టిపడిందని సుజీత్ తెలిపారు. 'జానీ'లోని లెట్స్‌గో జానీ సాంగ్ , 'తమ్ముడు'లోని ట్రావెలింగ్ సోల్జర్ సాంగ్‌నూ 'ఓజీ' కోసం రీమిక్స్ చేశారు.



# హీరోగా కట్టప్ప.. ఒకవేళ నిజమైతే?



'బాహుబలి'.. టాలీవుడ్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా. ఎందుకంటే పాన్ ఇండియా అనే సరికొత్త ట్రెండ్‌కి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు అందరూ భారీ బడ్జెట్, సీక్వెల్స్ అని ఎగబడుతున్నారంటే దానికి ఓ రకంగా ఈ మూవీనే కారణమని చెప్పొచ్చు. అయితే ఈ చిత్ర రెండు భాగాల్ని ఒక్కటిగా చేసి 'బాహుబలి: ద ఎపిక్' పేరుతో అక్టోబరు 31న రీ రిలీజ్ చేయనున్నారు. దీనికి కూడా ప్రమోషన్స్ చేస్తారనే టాక్ వినిపిస్తుంది. సరే ఇవన్నీ పక్కనబెడితే 'బాహుబలి' యూనివర్స్ నుంచి ఓ కొత్త సినిమా రాబోతుందనే న్యూస్ ఇప్పుడు బయటకొచ్చింది.రాజమౌళి తండ్రి, 'బాహుబలి' కథా రచయిత విజయేంద్ర ప్రసాద్.. ప్రస్తుతం కట్టప్ప పాత్ర బ్యాక్ స్టోరీ స్క్రిప్ట్ రాసే పనిలో ఉన్నారని సమాచారం. అసలు కట్టప్ప ఎవరు? మాహిష్మతి సామ్రాజ్యానికి అతడు కట్టు బానిసగా ఎందుకు మారాల్సి వచ్చింది? అసలు కట్టప్ప వంశం ఏంటి? అనే అంశాల చుట్టూ కథ ఉండబోతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమాకు రాజమౌళి దర్శకత్వం చేస్తారా? లేదంటే వేరే ఎవరైనా వస్తారా అనేది తెలియాల్సి ఉంది.ప్రస్తుతానికైతే ప్రీ విజువలైజేషన్ వర్క్ మొదలైందని, త్వరలో ఈ ప్రాజెక్ట్ గురించి ప్రకటన రానుందనే టాక్ అయితే వినిపిస్తుంది. అయితే ఇదంతా నిజమేనా? లేదంటే 'బాహుబలి' రీ రిలీజ్‌లో భాగంగా ఈ రూమర్స్ వస్తున్నాయా అనేది చూడాలి? ఒకవేళ నిజమైతే మాత్రం దాన్ని ఏ మేరకు ఆసక్తికరంగా తెరకెక్కిస్తారా అనేది సస్పెన్స్. రాజమౌళి ప్రస్తుతం మహేశ్ బాబుతో ఓ మూవీ చేస్తున్నారు. అడ్వెంచర్ జానర్‌లో దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా అడవుల్లో షూటింగ్ చేశారు. కొన్నాళ్ల క్రితం కెన్యా కూడా వెళ్లొచ్చారు. 'బాహుబలి' రీ రిలీజ్ తర్వాత కొత్త షెడ్యూల్ మొదలు కానుందని అంటున్నారు.

# 'కాంతార చాప్టర్ 1' ఆ సన్నివేశాల సమయంలో నియమాలు పాటించా: రిషబ్‌శెట్టి



'కాంతార'కు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతున్న సినిమా 'కాంతార 2' . 'కాంతార చాప్టర్ 1' పేరుతో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా గురించి రిషబ్ శెట్టి కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. కాంతార క్లైమాక్స్ కంటే ఇది ఇంకా శక్తిమంతంగా ఉంటుందన్నారు."కాంతార చాప్టర్ 1'లో కొన్ని సన్నివేశాలు ఎప్పటికీ మర్చిపోలేరు. ముఖ్యంగా ఒక సీన్ మీకు జీవితాంతం గుర్తుంటుంది. కచ్చితంగా చిత్ర పరిశ్రమలోని వారికి నన్ను చూసినప్పుడు ఆ సన్నివేశం గుర్తుకువస్తుంది. భాషతో సంబంధం లేకుండా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ పరిశ్రమలోని వారు కూడా దాని గురించి మాట్లాడుకుంటారు. దర్శక నిర్మాతలు, సాంకేతిక నిపుణులు అందరూ దీన్ని ప్రేరణగా తీసుకుంటారు. కాంతార చిత్రం తర్వాత నా జీవితం మారిపోయింది. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేను. కొత్తగా అనిపించింది. ఈ విజయం నా టీమ్ అందరికీ చెందుతుంది" అని తెలిపారు.

"ఈ సినిమాలో దేవుడికి సంబంధించిన సన్నివేశాలు తీసే సమయంలో నేను నియమాలు పాటించాను. మాంసాహారం తీసుకోలేదు. చెప్పులు వేసుకోలేదు. నేను భగవంతుడిని బాగా నమ్ముతాను. అందుకే ఆ సన్నివేశాలు తెరకెక్కించేటప్పుడు నాకు నేను పరిమితులు విధించుకున్నా. నేను ఇతరుల నమ్మకాల గురించి మాట్లాడను. ఎవరి నమ్మకం వారిది" అని రిషబ్ అన్నారు.అకీరాతో 'ఓజీ 2'.. సుజీత్ ఏమన్నారంటే!

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో ఇది రానుంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది. "నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు" అంటూ ఓ కుర్రాడు వేసే ప్రశ్నతో మొదలైన ట్రైలర్.. అందులో కనిపించిన సరికొత్త ప్రపంచం, ఓ అసాధారణ ప్రేమకథ, ఈశ్వరుడి నేపథ్యం, భారీ యుద్ధాలు.. అన్నీ ఆసక్తి రేకెత్తించేలా ఉన్నాయి. ఆఖర్లో ఈశ్వర అవతారంలో త్రిశూలంతో రిషబ్ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది.

# సూపర్ ఓవర్‌లో శ్రీలంకపై విజయం సాధించిన భారత్




దుబాయ్: ఆసియా కప్ (Asia Cup)లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్ ఓవర్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. నామమాత్రపు పోరులో తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (61: 31 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్), తిలక్ వర్మ (49*: 34 బంతుల్లో 4 ఫోర్లు ఒక సిక్స్), సంజూ శాంసన్ (39: 23 బంతుల్లో ఒక ఫోర్, 3 సిక్స్‌లు) చెలరేగడంతో టీమ్‌ఇండియా భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక 20 ఓవర్లో 5 వికెట్లు కోల్పోయి స్కోర్‌ను సమం చేసింది. ఓపెనర్ నిస్సాంక (107: 58 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) అద్భుత శతకం బాదగా, కుశాల్ పెరీరా (58: 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగి ఆడాడు. చివరి బంతికి ఆ జట్టు విజయానికి 3 పరుగులు అవసరం కాగా 2 పరుగులే రావడంతో మ్యాచ్ టై అయింది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ బౌలింగ్ ప్రతాపానికి శ్రీలంక 5 బంతుల్లో 2 వికెట్లు కోల్పోయి కేవలం 2 పరుగులే చేసింది. అనంతరం భారత్ తొలి బంతికే మూడు పరుగులు చేసి విజయం సాధించింది. నిస్సాంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వచ్చింది.

సూర్యకుమార్ యాదవ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత

**నిస్సాంక మెరుపు ఇన్నింగ్స్..**


నామమాత్రపు పోరే అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో శ్రీలంక గెలుపు తీరాలకు వచ్చి చివరిమెట్టుపై బోల్తాపడింది. 203 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక తొలి ఓవర్ నాలుగో బంతికే వికెట్ కోల్పోయింది. హార్దిక్ బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి కుశాల్ మెండిస్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే తొలి వికెట్ తీసిన ఆనందం భారత్‌కు ఎక్కువసేపు లేకుండా చేశారు ప్రత్యర్థి బ్యాటర్లు. మెండిస్ ఔట్‌తో క్రీజులోకి వచ్చిన కుశాల్‌తో కలిసి నిస్సాన్ భారీ ఇన్నింగ్స్ నిర్మించాడు. ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడడంతో శ్రీలంక 10 ఓవర్లు ముగిసే సరికి 114 పరుగులతో నిలిచింది. 25 బంతుల్లో అర్ధశతకం చేసిన నిస్సాంక ఆ తర్వాత సైతం దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో 13వ ఓవర్ రెండో బంతికి కుశాల్ పెరీరా (58) స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో 127 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. 15 ఓవర్లకు శ్రీలంక 157/2తో నిలిచింది. అప్పటికి శ్రీలంక విజయానికి 30 బంతుల్లో 46 పరుగులు అవసరం. దీంతో భారత్ విజయంపై ఆశలు కోల్పోయింది. ఆ సమయంలో నిస్సాంక శతకానికి చేరువలో ఉన్నాడు. అయితే 16వ ఓవర్ తొలి బంతికి కుల్‌దీప్ బౌలింగ్‌లో చరిత్ అసలంక (5) గిల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కి చేరాడు. ఆ ఓవర్లో కేవలం 4 పరుగులే వచ్చాయి. ఆ తర్వాత అర్ష్‌దీప్ బౌలింగ్‌లో కమిందు మెండిస్ (3) అక్షర్ పటేల్‌కు చిక్కాడు. ఈ క్రమంలో 52 బంతుల్లో నిస్సాంక అంతర్జాతీయ టీ20ల్లో తొలి శతకం నమోదు చేశాడు. చివరి రెండు ఓవర్లలో శ్రీలంక విజయానికి 23 పరుగులు అవసరం కాగా, 19 ఓవర్లో 11 పరుగులు వచ్చాయి. దీంతో శ్రీలంక విజయానికి 6 బంతుల్లో 12 అవసరం అయ్యాయి. దీంతో ఇరు జట్లలో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. చివరి ఓవర్ వేసిన హర్షిత్ రాణా తొలి బంతికే నిస్సాంకను ఔట్ చేయడంతో ఒక్కసారిగా భారత శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. తర్వాతి మూడు బంతులకు 2, 1, 2 పరుగులు వచ్చాయి. ఐదో బంతికి శనక ఫోర్ కొట్టాడు. దీంతో శ్రీలంక విజయ సమీకరణం చివరి బంతికి మూడు పరుగులుగా మారింది. అయితే చివరి బంతికి రెండు పరుగులు రావడంతో మ్యాచ్ టై అయింది. భారత బౌలర్లలో హార్దిక్, వరుణ్, కుల్‌దీప్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా ఒక్కో వికెట్ తీశారు.

**మళ్లీ అదరగొట్టిన అభిషేక్..**

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. జట్టు స్కోర్ 15 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ (4) ఔటయ్యాడు. అయితే సూర్యకుమార్ యాదవ్ (12)తో జట్టుకట్టిన అభిషేక్ శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో అభిషేక్ వరుసగా మూడు అర్ధశతకాలు బాదినట్లైంది. ఈ క్రమంలో 74 పరుగుల వద్ద సూర్య ఎల్బీగా వెనుదిరిగాడు. 92 పరుగుల వద్ద అసలంక బౌలింగ్‌లో అభిషేక్ శర్మ కమిందు మెండిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 10 ఓవర్లకు భారత్ 3 వికెట్ల నష్టానికి 100 పరుగులతో నిలిచింది. అభిషేక్ ఔటైన అనంతరం క్రీజులోకి వచ్చిన శాంసన్‌తో కలిసి తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇద్దరు బ్యాటర్లు దూకుడుగా ఆడడంతో భారత్ 15 ఓవర్లకు 150 పరుగులతో నిలిచింది. 16వ ఓవర్లో శనక బౌలింగ్‌లో శాంసన్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన హార్దిక్ చమీరా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అనంతరం అక్షర్ పటేల్‌తో కలిసి తిలక్ వర్మ భారత్ స్కోర్‌ను 200 పరుగులు దాటించాడు. శ్రీలంక బౌలర్లలో తీక్షణ, చమీర, హసరంగ, శనక, అసలంక తలో వికెట్ తీసుకున్నారు.




# క్రికెటర్ల నుంచి స్ఫూర్తి పొందా: బోల్ట్



ముంబై: క్రికెటర్లు మైదానంలో చూపే అంకితభావం... ఆట కోసం వారు కష్టపడే తీరు చూసి ఎంతగానో స్ఫూర్తి పొందినట్లు స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ పేర్కొన్నాడు. క్రికెటర్లు గ్రౌండ్‌లో తమ సర్వస్వాన్ని అంకితం చేయడం... అథ్లెటిక్స్‌లో తాను రాణించేందుకు ప్రేరణనిచ్చిందని ఈ 'జమైకా చిరుత' వెల్లడించాడు. సుదీర్ఘకాలం పాటు పరుగుకు పర్యాయపదంగా నిలిచిన బోల్ట్ 8 ఒలింపిక్ స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 11 పతకాలు సాధించాడు. శుక్రవారం ముంబైలోని జమునాబాయి నర్సీ క్యాంపస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బోల్ట్ పాల్గొన్నాడు.

ఈ కార్యక్రమంలో క్రీడా రంగ ప్రముఖులతో పాటు బాలీవుడ్ తారలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోల్ట్ మాట్లాడుతూ... 'నేను చిన్నప్పుడు క్రికెట్‌కు వీరాభిమానిని. క్రికెట్ ఎదుగుదలను చూశాను. క్రికెటర్ల ప్రతిభను, వారు పనిచేసే తీరును, వారు తమను తాము మలుచుకునే విధానం అథ్లెటిక్స్‌లో నాకు ఎంతగానో ప్రేరణనిచ్చాయి' అని అన్నాడు. మైకెల్ హోల్డింగ్, కోట్నీ వాల్ష్, క్రిస్ గేల్ వంటి పలువురు ప్రఖ్యాత క్రికెటర్లు కూడా జమైకన్‌లే కాగా... వారి ప్రభావం తనపై అధికంగా ఉన్నట్లు బోల్ట్ పేర్కొన్నాడు. విజయానికి దగ్గరి దారులు ఉండవన్న బోల్ట్ కష్టపడితే తప్పక ఫలితం వస్తుందని అన్నాడు. 'ప్రతి పనికి కష్టపడాల్సిందే. క్రీడల్లో అంకితభావం కూడా అవసరం. ట్రాక్ అండ్ ఫీల్డ్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే దానిపై ఎక్కువ కష్టపడ్డా. ఏ రంగంలోనైనా అగ్రస్థానానికి చేరడం అంత సులభం కాదు.

పరిస్థితులు పరీక్షిస్తున్నప్పుడు కఠిన సమయాలను దాటుకుంటూ ప్రపంచంలో అత్యుత్తమ అథ్లెట్‌గా నన్ను నేను మలుచుకునేందుకు పట్టుదల, అంకితభావంతో కృషి చేశా. అందుకు తగ్గ ప్రతిఫలం సాధించా' అని 39 ఏళ్ల బోల్ట్ అన్నాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డు (9.58 సెకన్లు) నెలకొల్పిన బోల్ట్... గతంలోనూ పలు సందర్భాల్లో తనకు క్రికెట్ మీద ఉన్న ఇష్టాన్ని వెల్లడించాడు.

# నిరంతరం ప్రయత్నిస్తే.. విజయం మనదే: భారత అథ్లెట్ ఆనంద్‌కుమార్

ఆటల్లో గెలుపోటములు సహజమని.. నిరంతరం ప్రయత్నిస్తే ఏదో ఒకరోజు విజయం సొంతమవుతుందని తమిళనాడుకు చెందిన అథ్లెట్ ఆనంద్‌కుమార్ తెలిపాడు. ఈ నెల 13 నుంచి 21 వరకు చైనాలో నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆనంద్ రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి రికార్డు సృష్టించాడు. పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్, 42 మీటర్ల స్కేటింగ్ మారథాన్‌లో పసిడి పతకాలు సాధించాడు. వెయ్యి మీటర్ల స్ప్రింట్‌ను ఒక నిమిషం 23 సెకన్లలో పూర్తి చేసి.. స్పీడ్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారత అథ్లెట్‌గా నిలిచాడు. దీనితోపాటు ఈ సిరీస్‌లో జరిగిన 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నాడు. భారత్ తరపున అద్భుత ప్రదర్శన చేసిన ఆనంద్‌కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభినందించారు.

చైనా నుంచి భారత్‌కు తిరిగివచ్చిన అనంతరం ఆనంద్‌కుమార్‌ను తమిళనాడు ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ప్రభుత్వం తరపున అతడికి రూ.1.8 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా 'ఈటీవీ భారత్'కిచ్చిన ఇంటర్వ్యూలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. "రెండు బంగారు పతకాలు గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మళ్లీ స్వర్ణం గెలవడమే నా లక్ష్యం. మనం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి.. ఏదో ఒక రోజు విజయం మన సొంతమవుతుంది" అని పేర్కొన్నాడు.




# సూర్యకుమార్‌పై ఐసీసీ కొరడా

**మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా**

**శిక్షపై అప్పీల్ చేసిన భారత్**

**రవూఫ్‌కు 30 శాతం జరిమానా**

దుబాయ్: ఆసియా కప్ టీ20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్‌పై విజయాన్ని భారత సైనికులకు అంకితం ఇస్తున్నట్లుగా భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చేసిన ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. ఈ వ్యాఖ్య రాజకీయపరమైనదని, ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంటూ అతనిపై చర్య తీసుకుంది. సూర్యకుమార్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించింది. సెప్టెంబర్ 14న లీగ్ దశలో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.




మ్యాచ్ ముగిసిన తర్వాత 'పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు మేం అండగా ఉంటాం. మా విజయం భారత సైనికులకు అంకితం' అని సూర్య వ్యాఖ్యానించాడు. క్రీడల్లో ఆర్మీ ప్రస్తావన తీసుకురావడాన్ని ప్రశ్నిస్తూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఐసీసీకి ఫిర్యాదు చేసింది. గతంలోనూ రాజకీయపరమైన, గాజాపై ఇజ్రాయిల్ దాడివంటి అంశాలపై క్రికెటర్లు స్పందించకుండా ఐసీసీ ఆంక్షలు పెట్టిన విషయాన్ని పీసీబీ తమ ఫిర్యాదులో పేర్కొంది.

ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ విచారణ జరిపారు. రిఫరీ ముందు హాజరైన సూర్యకుమార్ తాను ఎలాంటి తప్పూ చేయలేదని సమాధానమిచ్చాడు. సూర్య వివరణపై విభేదించిన రిఫరీ ఇక ముందు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరిస్తూ 30 శాతం జరిమానా విధించారు. ఈ శిక్షపై బీసీసీఐ అప్పీల్ చేసినట్లు సమాచారం. అయితే మళ్లీ ఎప్పుడు విచారణ జరుగుతుందనే విషయంలో స్పష్టత లేదు. ఇక్కడా కూడా సూర్యదే తప్పని నిర్ధారణ అయితే శిక్ష మరింత పెరుగుతుంది.

**ఫర్హాన్‌కు హెచ్చరికతో సరి!**

సూపర్–4 దశలో భారత్‌తో మ్యాచ్‌లో పాక్ ఆటగాళ్లు హారిస్ రవూఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్ ప్రవర్తన గురించి బీసీసీఐ చేసిన ఫిర్యాదుపై కూడా రిచర్డ్సన్ విచారణ జరిపారు. ప్రేక్షకుల వైపు చూస్తూ యుద్ధంలో భారత విమానాలు కూలినట్లుగా, వాటి సంఖ్య ఆరు అన్నట్లుగా రవూఫ్ పదే పదే సైగలు చేశాడు. తాను కూడా తప్పేమీ చేయలేదని, ప్రేక్షకులను ఉత్సాహపరిచేందుకే అలా చేశానని రవూఫ్ ఇచ్చిన వివరణతో కూడా సంతృప్తి చెందని రిఫరీ అతనికి కూడా 30 శాతం జరిమానా విధించారు. అయితే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత ఏకే–47 తరహాలో బ్యాట్‌ను ఎక్కు పెట్టి సంబరాలు చేసుకున్న ఫర్హాన్‌పై మాత్రం ఎలాంటి చర్య తీసుకోలేదు. తాను అలా చేయడంలో ఎలాంటి దురుద్దేశం లేదని, తాను ఉండే ప్రాంతంలో ఏదైనా సంబరాల సమయంలో ఇలా గన్‌ను సరదాగా ఎక్కు పెడతారని అతను చెప్పాడు. గతంలో ధోని, కోహ్లి కూడా మైదానంలో ఇలాంటిదే చేసిన విషయాన్ని కూడా అతను గుర్తు చేశాడు. దాంతో ఫర్హాన్‌ను రిఫరీ కేవలం హెచ్చరికతో వదిలి పెట్టారు.



# అతడు నిలబడ్డాడా.. విజయం మీకు దూరమైనట్లే: పాక్‌కు అక్తర్ హెచ్చరిక



మరో మ్యాచ్ మిగిలిఉండగానే ఆసియా కప్ 2025 ఫైనలిస్ట్‌లు ఎవరో తేలిపోయింది. సెప్టెంబర్ 28న భారత్ - పాకిస్థాన్ టైటిల్ కోసం తలపడతాయి. ఇప్పటికే ఈ ఎడిషన్‌లో రెండుసార్లు పాక్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. హ్యాట్రిక్‌పై కన్నేసిన భారత్‌ను అడ్డుకోవడం తమ జట్టుకు చాలా కష్టమని పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించాడు. అయితే, ఒకే ఒక్క పని చేస్తేనే టీమ్‌ఇండియాపై ఒత్తిడి తెచ్చేందుకు వీలవుతుందని తెలిపాడు. పాక్ ప్లేయర్లు తమ మైండ్ సెట్‌ను త్వరగా మార్చుకోవాలని పేర్కొన్నాడు.

**41 ఏళ్ల ఆసియా కప్ చరిత్రలో అలా 'తొలిసారి'**

"భారత్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడికి గురయ్యే మైండ్‌సెట్ నుంచి పాక్ ఆటగాళ్లు బయటకు రావాలి. బంగ్లాపై ఎలా ఆడారో అలాగే భారత్‌ను ఎదుర్కోవాలి. మొత్తం 20 ఓవర్లూ బౌలింగ్ చేయాల్సిన అవసరం లేదు. పది వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి. ఇప్పుడు నేను చెప్పే మాటలు గుర్తు పెట్టుకోండి. అభిషేక్ శర్మను రెండు లేదా మూడు ఓవర్లలోనే ఔట్ చేస్తేనే వారిని ఇబ్బంది పెట్టొచ్చు. వారికి ఇప్పటివరకు వచ్చిన ఆరంభాలన్నీ అతడు తీసుకొచ్చినవే. అభిషేక్‌ను త్వరగా ఔట్ చేయాలి. అలా కుదరకపోతే మాత్రం మరోసారి ఇబ్బందులు తప్పవు. అభిషేక్ కూడా బంతిని మిస్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ. అతడిపై కాస్త ఎదురుదాడి చేయాలి. అప్పుడే భారత్ మిగతా బ్యాటర్లు కాస్త ఆచితూచి ఆడేందుకు ప్రయత్నిస్తారు. పరుగుల కోసం కష్టపడతారు. అయితే, భారత్ తమ అత్యుత్తమ గేమ్‌ను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. అక్కడ ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఉన్నాడు. పాక్‌పై టాప్ క్లాస్ ఆటను ఆడాలని భారత్‌కు చెబుతాడు. చెత్త జట్టుతో దిగినా, నాసిరకంగా ఆడినా పాక్ ఫైనల్‌కు చేరుకుంది. ఇక్కడ మాత్రం దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తారని భావిస్తున్నా" అని వ్యాఖ్యానించాడు.

**అతడు జట్టులో ఎందుకు?: వకార్**

ఆసియా కప్‌లో నాలుగు మ్యాచుల్లో డకౌట్ అయిన సైయామ్ ఆయుబ్‌పై పాక్ మాజీ ఆటగాడు వకార్ యూనిస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌లో రాణిస్తున్నప్పటికీ.. బ్యాటింగ్‌లో విఫలం కావడంపై విమర్శలు గుప్పించాడు. "ఆసియా కప్‌లో రెండోసారి డకౌట్ అయినప్పుడే నేను ఆయుబ్‌ను బెంచ్‌కే పరిమితం చేయాలని చెప్పా. అతడి స్థాయి ఆట ఇది కాదు. చాలా టాలెంట్ కలిగిన ప్లేయర్. ఒక్కోసారి మనం అనుకున్నవి కానప్పుడు విరామం తీసుకోవాలి. మైదానంలోకి వచ్చాక అతడి బాడీ లాంగ్వేజ్ కూడా పేలవంగా ఉంది. యువకుడైన అతడికి ఇంకా చాలా కెరీర్ ఉంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. కేవలం బౌలర్‌గానే ఆయుబ్ జట్టులో ఉన్నాడు. ఈ విషయంపై మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టాలి" అని వకార్ వ్యాఖ్యానించాడు.